www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 సంచిక: 130 హైదరాబాద్ మంగళవారం 29-07-2025 పేజీలు: 05 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## సీఎం వద్దే విద్యాశాఖ ఉన్నా అలాంటి ఘటనలు జరగడమేంటి?

ప్రతివారం ఏదో ఒక ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ జరిగి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని.. విద్యాశాఖ సీఎం వద్దే ఉన్నా ఇలాంటి ఘటనలు జరగడమేంటని భాజపా నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై వస్తున్న వార్తలు కొన్నే ఉన్నాయని, బయటకు రాని సంఘటనలు చాలా ఉన్నాయని అన్నారు. రాష్ట్ర భాజపా కార్యాలయంలో మీడియాతో ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు.

"గత ప్రభుత్వం బెల్ట్ షాపులు లేకుండా చేస్తామని చెప్పింది. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా అదే చెప్పింది కానీ.. ఎక్కడా మూసివేసిన దాఖలాలు లేవు. మద్యం అమ్మకాల ద్వారానే ఆదాయం సమకూర్చుకోవాలనే విధంగా గత ప్రభుత్వం వ్యవహరించింది.. ఈ ప్రభుత్వం దాన్నే కొనసాగిస్తోంది. గతం కంటే మూడు రెట్లు పెంచింది. మద్యం మత్తులో ప్రజలను ఉంచి 6 గ్యారంటీలను మర్చిపోయేలా చేయాలని చూస్తోంది. ఏ శాఖలో చూసినా అవినీతి విపరీతంగా పెరిగిపోయింది.



కురుస్తున్న వర్షాలకు జీహెచ్ఎంసీ పరిధిలో మోకాలు లోతు నీళ్లు నిలుస్తున్నాయి. పరిస్థితి మారట్లేదు. ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొంటున్నారు.. కానీ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే నాయకుడే లేరు. పరిపాలన చేతకాకుంటే దిగిపోండి"అని ప్రభాకర్ అన్నారు.

## మార్కింగ్ లేదా? ఇందిరమ్మ రద్దు!

- ఆగస్టు 15 వరకు ముగ్గు పోయకపోతే ఇండ్ల అనుమతులు రద్దు చేస్తాం
- లబ్దిదారులపై హౌసింగ్ అధికారుల ఒత్తిడి
- అప్పటికీ ముందుకు రాకుంటే ఇతరులకు కేటాయింపు
- మేడ్చల్-మల్కాజిగిరిలో 1,617 ఇండ్లు మంజూరు



2

## పాలన గాలికి.. ప్రగతి కాటికి.. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం

మద్యం దుకాణాలను పల్లెలకు విస్తరించాలన్న కాంగ్రెస్ నిర్ణయంపై కేటీఆర్ ఫైర్

ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకుందని విమర్శ

నాడు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని ఆగ్రహం



3

## రాహుల్ గాంధీ కన్వర్ట్ అయ్యారు.. మోడీ కాదు

- మోడీపై కాంగ్రెస్ ఆరోపణలు అసత్యం
- కేసీఆర్ కుల సర్వే, బీసీలకు న్యాయం చేయలేదని విమర్శ
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు బీసీలకే
- బీసీల సంక్షేమం కోసం బీజేపీ మహాధర్నా సిద్ధం : రాంచందర్ రావు



2



3

## మీనాక్షి నటరాజన్ పాదయాత్ర షెడ్యూల్ విడుదల

- ఈనెల 31 నుంచి నియోజకవర్గాల్లో మీనాక్షి నటరాజన్ పాదయాత్రలు
- పరిగి నుంచి పాదయాత్ర ప్రారంభించనున్న ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్
- ప్రతి నియోజకవర్గంలో 8 నుంచి 10 కి.మీ పాదయాత్ర
- వారం రోజుల పాటు కొనసాగనున్న మీనాక్షి నటరాజన్ పాదయాత్రలు

## సృష్టించకుండా శిశు విక్రయాలు!



- సరోగసీ పేరుతో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ దందా
- ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండానే చేస్తామంటూ జంటలతో ఒప్పందాలు
- ఒక్కో కేసుకు రూ.40 లక్షల దాకా వసూలు.. సరోగసీ నిర్వహించకుండా పేదింటి పిల్లల అప్పగింత



2

## వాడీవేడిగా ఆపరేషన్ సిందూర్ పై చర్చ...

- కేంద్రంపై విపక్షాల విమర్శలు
- తిప్పికొట్టిన రాజ్ నాథ్



2

## నెలరోజులైనా 'సిగాచి' బాధితులకు అందని పరిహారం..

- సిగాచీ పరిశ్రమ ప్రమాద బాధితులకు పరిహార అందలేదన్న హరీశ్ రావు
- బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలని అదనపు కలెక్టర్‌ను కలిసిన హరీశ్ రావు
- పరిహారం అందకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారన్న మాజీ మంత్రి



2



3

## ఒక్క కమిటీ.. వంద చిక్కులు!

- దేశ సాగునీటి రంగంలో బనకచర్ల చిచ్చు
- చట్టాలు, ట్రిబ్యునళ్ల మనుగడ ప్రశ్నార్థకం
- వాటిని అపహాస్యం చేసేలా రేవంత్ ప్రతిపాదన
- కమిటీలతో తేలితే అంతర్రాష్ట్ర చట్టమెందుకు?
- 2 రాష్ట్రాల ఇంజినీర్లు మిగులును తేలుస్తరా?
- మిగులుపై కడితే కేటాయింపులకు రక్షణేది?
- బనకచర్ల కమిటీపై నిపుణుల్లో ఆందోళన
- రాష్ట్రానికి మరో మరణశాసనమని హెచ్చరిక

## బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం



2

నిన్నైనా, రేపైనా న్యాయమైన

## కోటా ఇచ్చేది కేసీఆరే

- మాట తప్పిన కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలి
- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బంపర్ మెజార్టీతో గెలిపిస్తేనే రేవంత్ ప్రభుత్వం సెట్‌రైట్ అవుతది
- పరకాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గిఫ్ట్ ఏ స్మైల్'
- మహిళలకు కుట్టుమిషన్లు, కేసీఆర్ కిట్ల పంపిణీ

# సృష్టించకుండా శిశు విక్రయాలు!

- సరోగసీ పేరుతో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ దందా
- ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండానే చేస్తామంటూ జంటలతో ఒప్పందాలు
- ఒక్కో కేసుకు రూ.40 లక్షల దాకా వసూలు.. సరోగసీ నిర్వహించకుండా పేదింటి పిల్లల అప్పగింత



**హైదరాబాద్ జూలై 28(సిద్దిపేట పవర్):**

సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఓ జంటను మోసగించడం.. తెలుగు రాష్ట్రాల్లో ప్రకంపనలు సృష్టించగా, దీనిపై పోలీసుల దర్యాప్తులో నిర్ఘాంతపోయే విషయాలు వెలుగులోకొచ్చాయి. ఈ సెంటర్ కేంద్రంగా వ్యవస్థీకృత శిశు విక్రయాల దందా సాగుతున్న వైనం బట్టబయలయ్యింది. ఇప్పటికే పది కేసులు ఉండి, ఎలాంటి అనుమతులు లేకుండా ఈ సెంటర్ నిర్వహిస్తున్న అట్లూరి నమ్రత అలియాస్ పచ్చిపాల నమ్రత మరో వైద్యురాలి పేరుతో కథ నడిపిస్తున్నట్లు తెలిసింది.

సంతానం కోసం వచ్చే వారికి ప్రభుత్వ అనుమతి, ఇతర ప్రొసీజర్‌తో పని లేకుండా సరోగసీ చేస్తామని చెప్పి లక్షల్లో వసూళ్లు చేస్తూ.. చివరకు అలాంటి ప్రక్రియ ఏదీ చేయకుండా నిరుపేద దంపతులకు ఎరవేసి, వారికి చెందిన పిల్లల్ని అప్పగిస్తున్నట్లు తేలింది. రాజస్థాన్‌కు చెందిన ఓ జంటకు కూడా ఇలాగే చేయగా.. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 'సృష్టి'నిర్వాకం తాజాగా మరోసారి బయటపడింది.

గోపాలపురం పోలీసులు నమోదు చేసిన కేసుకు సంబంధించి హైదరాబాద్, విశాఖపట్నంలో కలిపి 8 మందిని అరెస్టు చేశామని, వీరిలో గాంధీ ఆస్పత్రి అనస్థీషియా స్పెషలిస్ట్ సదానందం కూడా ఉన్నట్లు నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ ఆదివారం వెల్లడించారు. మరో 50 మంది పరారీలో ఉన్నారని వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని తెలిపారు. ఏసీపీ సుబ్బయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు.

**ఇప్పటికే 10 కేసులు..రెన్యువల్ కాని లైసెన్స్**

1995 నుంచి వైద్య వృత్తిలో ఉన్న నమ్రత 1998 నుంచి ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ రంగంలోకి దిగారు. సికింద్రాబాద్, కొండాపూర్, విశాఖపట్నం, విజయవాడల్లో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో క్లినిక్స్ నిర్వహిస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు సహా అనేక అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఈమెపై హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో 10 కేసులు నమోదయ్యాయి. దీంతో ఆమె ఫెర్టిలిటీ సెంటర్ నిర్వహణ లైసెన్స్‌ను 2021లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పొడిగించలేదు. దీంతో తాను ఆ వృత్తి నిర్వహించట్లేదంటూ నమ్రత లేఖ కూడా ఇచ్చారు.

**నగరంలో నాలుగు చోట్ల సెంటర్లు**

నమ్రత సికింద్రాబాద్‌లోని గోపాలపురంలో నాలుగు అంతస్తుల భవనంతో పాటు మరో మూడుచోట్లా అక్రమంగా ఈ సెంటర్లు నిర్వహిస్తున్నారు. అయితే తన పేరుతో కాకుండా డాక్టర్ సూరి శ్రీమతి పేరుతో ముద్రించిన లెటర్ హెడ్స్‌తో కథ నడిపిస్తున్నారు. ఆన్‌లైన్‌తో పాటు కరపత్రాల ద్వారా ఐవీఎఫ్ విధానం పేరుతో ప్రచారం చేస్తున్న నమ్రత.. సంతాన భాగ్యం కోసం తమ వద్దకు వచ్చే వారికి కొన్ని పరీక్షలు చేసి, ఆ విధానంతో ఫలితం లేదని చెప్తున్నారు.

ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండా గుట్టుగా సరోగసీ చేస్తామంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారు. అంగీకరించిన భార్యభర్తల నుంచి ఎగ్, వీర్య సంగ్రహణ పేరుతో సికింద్రాబాద్‌తో పాటు వైజాగ్‌లో ఉన్న క్లినిక్స్‌లో హడావుడి చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ తంతు నిర్వహణలో గాంధీ ఆస్పత్రి అనస్థీషియా స్పెషలిస్ట్ నార్గుల సదానందం సహకరిస్తున్నారు.

ఎంపిక చేసిన మహిళతో సరోగసీ చేస్తున్నామని, వివరాలన్నీ రహస్యమని చెబుతూ భార్యభర్తలకు ఫోన్ ద్వారా మాత్రమే సమాచారం ఇస్తున్నారు. అయితే సరోగసీ ప్రక్రియ ఏదీ నిర్వహించడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకున్న దళారుల ద్వారా నిరుపేద గర్భవతుల్ని గుర్తించి వారి భర్తలతో సంప్రదింపులు జరుపుతున్నారు. పుట్టిన శిశువును తమకు విక్రయిస్తే నగదు ఇస్తామంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారు.

ప్రసవ సమయానికి మహిళల్ని తామే తీసుకువెళ్లి డెలివరీలు చేస్తున్నారు. ఒక ప్రాంతానికి చెందిన వారిని మరో ప్రాంతానికి తరలించి ఈ తంతు పూర్తి చేస్తున్నారు. ఆ సమయంలోనూ సిజేరియన్ సహా మరికొన్ని ఖర్చులు అయ్యాయంటూ ఒప్పందం చేసుకున్న వారి నుంచి మరికొంత గుంజుతున్నారు. వేరే వారికి పుట్టిన శిశువును ఆయా జంటలకు సరోగసీ బిడ్డగా అప్పగిస్తున్నారు. ఇలా ఒక్కో కేసుకు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

**శిశువు పోలికలపై అనుమానంతో..**

సికింద్రాబాద్‌లో నివసించిన రాజస్థాన్ జంటను నమ్రత ఇలానే మోసం చేశారు. శిశువు పోలికలపై అనుమానం వచ్చిన దంపతులు నమ్రతను నిలదీయగా సరైన సమాధానం రాలేదు. దీంతో ఢిల్లీలో డీఎన్ఏ టెస్టులు చేయించుకోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సరోగసీ పేరుతో తమ వద్ద రూ.30.25 లక్షలు తీసుకున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

దీంతో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సాయంతో దాడులు చేసిన గోపాలపురం పోలీసులు..నమ్రత, జయంత్ కృష్ణ, విశాఖ బ్రాంచ్ మేనేజర్ సి.కళ్యాణి, టెక్నీషియన్ జి.చిన్నారావు, సదానందం, దళారి డి.సంతోషి, అసోం నుంచి వచ్చి నగరంలో నివసిస్తున్న సదరు శిశువు తల్లిదండ్రులైన మహ్మద్ అలీ ఆదిక్, నస్రీన్ బేగంలను అరెస్టు చేశారు. 'సృష్టి'నుంచి సేకరించిన రికార్డుల ఆధారంగా మరో 50 మందిని నిందితులుగా గుర్తించారు. వీరికోసం గాలిస్తున్నారు. ఫిర్యాదు చేసిన జంట నుంచి శిశువును స్వాదీనం చేసుకున్న పోలీసులు శిశువిహార్‌కు తరలించారు.

**ఎవరైనా ప్రశ్నిస్తే రంగంలోకి నమ్రత కుమారుడు**

ఈ దందాలో ఎవరికైనా, ఏదైనా అనుమానం వచ్చి ప్రశ్నిస్తే.. 'సృష్టి'ప్రాంగణంలో లీగల్ ఆఫీస్ నిర్వహిస్తున్న నమ్రత కుమారుడు, న్యాయవాది జయంత్ కృష్ణ రంగంలోకి దిగుతాడని తెలిసింది. ఈ వ్యవహారంలో మీదీ నేరమే అని, విషయం బయటకు వస్తే అంతా అరెస్టు అవుతారని చెప్పి భయపెడతాడని, సెంటర్ ఆర్థిక లావాదేవీలను ఇతడే పర్యవేక్షిస్తుంటాడని తెలిసింది. కాగా తన పేరుతో ఈ సెంటర్ నడుస్తున్నట్లు సూరి శ్రీమతికి తెలుసా? లేదా? అనేది పోలీసులు ఆరా తీస్తున్నారు. 'సృష్టి'బారిన పడి మోసపోయిన వాళ్లు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు.

# రాహుల్ గాంధీ కన్వర్ట్ అయ్యారు.. మోడీ కాదు

- మోడీపై కాంగ్రెస్ ఆరోపణలు అసత్యం
- కేసీఆర్ కుల సర్వే, బీసీలకు న్యాయం చేయలేదని విమర్శ
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు బీసీలకే
- బీసీల సంక్షేమం కోసం బీజేపీ మహాధర్నా సిద్ధం : రాంచందర్ రావు



**హైదరాబాద్ జూలై 28(సిద్దిపేట పవర్):**

మోడీని కూడా కన్వర్టెడ్ బీసీ అని విమర్శలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యానించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ కన్వర్ట్ అయ్యారు.. మోడీ కాదు అని ఆయన విమర్శించారు. కేసీఆర్ గతంలో ఎంబీసీ చైర్మన్ పెట్టి రూ.1000 కోట్లు కేటాయిస్తామన్నారు.. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కేసీఆర్.. సమగ్ర కుల సర్వే చేశాడు.. కానీ నివేదిక బయటపెట్టలేదన్నారు. తెలంగాణలో బీసీలు 52 శాతానికి పైగా ఉన్నారని, కుల గణన కొన్ని మండలాల్లో జరగనే లేదు.. ఎలా పూర్తిచేశారన్నారు రాంచందర్ రావు. నిజంగానే రాష్ట్ర ప్రభుత్వం చేస్తే నిజాలు ఎందుకు బయపెట్టడంలేదని, అందుకే కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు కుల గణన కూడా చేపట్టనుందన్నారు. అందులో వాస్తవాలు చెప్పి దాని ప్రకారం సంక్షేమ పథకాలు ఇంప్లిమెంట్ చేస్తామని, రాజ్యాంగం మారుస్తారని, ఎస్సీలకు రిజర్వేషన్లు ఎత్తేస్తారని అమిత్ షా మాట్లాడినట్లు కాంగ్రెస్ సృష్టించిందన్నారు రాంచందర్ రావు. ఈ కేసు సీఎంపైనే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చినా ఇవ్వకున్నా.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్ద పీట వేస్తామని, 42 శాతం పక్కాగా ఓన్లీ బీసీలకే ఇస్తామన్నారు. కాంగ్రెస్ చెబుతున్నట్లుగా వాటిలో కూడా 10 శాతం ముస్లింలకు ఇవ్వబోమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, బీసీలకు లబ్ధి చేకూర్చేలా కేంద్రం ముందుకు వెళ్తుంటే తమకు నష్టమని భావించి కాంగ్రెస్ దుష్ప్రచారాలకు దిగుతోందని ఆయన మండిపడ్డారు. ఎలక్షన్స్ ముందు సీఎం రేవంత్ ఇచ్చిన స్టేట్ మెంట్లు బయటపెడతాం.. ఆయన ఏం మాట్లాడాడో బయటపెడతామని ఆయన వ్యాఖ్యానించారు. బీసీల సంక్షేమంపై కాంగ్రెస్ చేసేదంతా యాక్టింగే అని, వచ్చేనెల 2వ తేదీన ధర్నా చౌక్ వద్ద బీసీ రిజర్వేషన్లపై మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. బీసీల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ బీజేపీ మాత్రమే అని, కాంగ్రెస్ కేవలం ఓట్ల కోసమే ఆలోచిస్తుంది.. కానీ బీజేపీ ప్రజా సంక్షేమం గురించి ఆలోచిస్తుందన్నారు రాంచందర్ రావు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంలో బీసీల పాత్ర కీలకం.. వారికి అంతేస్థాయిలో ప్రయారిటీ ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

# మార్కింగ్ లేదా? ఇందిరమ్మ రద్దు!

- ఆగస్టు 15 వరకు ముగ్గు పోయకపోతే ఇండ్ల అనుమతులు రద్దు చేస్తాం
- లబ్ధిదారులపై హౌసింగ్ అధికారుల ఒత్తిడి
- అప్పటికీ ముందుకు రాకుంటే ఇతరులకు కేటాయింపు
- మేడ్చల్-మల్కాజిగిరిలో 1,617 ఇండ్లు మంజూరు

**హైదరాబాద్ జూలై 28(సిద్దిపేట పవర్):**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక అడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కు అన్నట్లు సాగుతోంది. కఠినమైన నిబంధనలు.. విడుతల వారీగా నిధుల విడుదల.. అతి తక్కువ స్థలంలో నిర్మాణం వంటి కండిషన్ల నేపథ్యంలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లపై అంతగా ఆసక్తి చూపడం లేదన్న విషయం తెలిసిందే. లబ్ధిదారుల పరిస్థితి ఇలా ఉంటే అధికారులు తీరు మరోలా ఉంది. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారిలో మెజార్టీ లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టడం లేదని.. ఎలాగైనా వారి చేత ఇండ్లు కట్టించేలా ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో ఆగస్టు 15 వరకు మార్కింగ్ (ముగ్గులు) పోయించుకోవాలని.. ఎవరైతే మార్కింగ్ చేసుకునేందుకు ముందుకు రాకపోతే వారి ఇండ్లను రద్దుచేయాలని ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

**కొర్రీలతో లబ్ధిదారుల్లో ఆందోళన..**

ఈ క్రమంలో లబ్ధిదారులు అసలు 'ఇందిరమ్మ' ఇండ్లు నిర్మించుకునేందుకు ఎందుకు ఆసక్తి కనబరచడం లేదనే ప్రశ్నలు ఇప్పుడు ఉత్పన్నమవుతున్నాయి. అర్హులకు మంజూరు చేయకపోవడమా.. లేదా కఠిన నిబంధనలే కారణమా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. 70 గజాల స్థలంలోనే ఇండ్లు నిర్మించుకోవాలని.. అధికారుల సూచనల మేరకు నిర్మాణాలు సాగాలని.. దశల వారీగా నిధుల విడుదల లాంటి సవాలక్ష కొర్రీలు లబ్ధిదారులను వేధిస్తున్నాయి.

70 గజాలు దాటి గృహం నిర్మిస్తే బిల్లు రాకపోతే ఎలా అన్నది ఆలోచిస్తున్నామని.. అందుకే ఇంటి నిర్మాణానికి తటపటాయిస్తున్నామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అర్హుల ఎంపిక ఇందిరమ్మ కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు జరగాల్సి ఉన్నా.. కాంగ్రెస్ నాయకులు జోక్యంతో అనర్హులకు ఇండ్లు మంజూరయ్యాయన్న విమర్శలూ లేకపోలేదు. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులకు ఇండ్లు కేటాయించడంతో పాటు నిబంధనలను సులభతరం చేస్తే అందరూ నిర్మాణాలు చేసుకునేవారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**శ్రావణమాసంలో అనుమానమే..**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో శ్రావణమాసంలో గృహ ప్రవేశాలు చేయడం అనుమానంగానే కనిపిస్తున్నది. జిల్లాలో ఇప్పటి వరకు 711 ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్(ముగ్గులు) పూర్తి అయ్యి.. గ్రౌండింగ్ కాగా 107 గృహాలకు బేస్మెంట్‌లు పూర్తయ్యాయి. 18 ఇండ్లకు మాత్రమే పై కప్పులు పడ్డాయి.



**లబ్ధిదారులపై అధికారుల ఒత్తిడి**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 1,617 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా.. వీటిలో 711 గృహాలకు మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన లబ్ధిదారులు వివిధ కారణాలతో ఇండ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే పథకం ప్రారంభమై 6 నెలలు గడుస్తున్నా లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణానికి ముందుకు రాకపోవడంతో అధికారులు ఆలోచనలో పడ్డారు. మిగిలినవారితో ఎలాగైనా ఇండ్లు నిర్మించుకునేలా చూడాలని కంకణం కట్టుకున్నారు.

ఈ క్రమంలోనే ఆగస్టు 15లోపు మిగిలిన 906 మందిచే మార్కింగ్ చేయించాలనుకుంటున్నారు. ఒకవేళ లబ్ధిదారులు మాట వినకపోతే వారికి కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లను రద్దు చేయాలని చూస్తున్నారు. ఆ ఇండ్లను మిగిలిపోయిన లబ్ధిదారులకు కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయాన్ని లబ్ధిదారులకు వివరిస్తున్నారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని.. మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ నియోజకవర్గాలకు సంబంధించి ఇందిరమ్మ ఇండ్ల కోసం 1.42లక్షల దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే.

# వాడీవేడిగా ఆపరేషన్ సిందూర్ పై చర్చ...

- విపక్షాలపై భగ్గుమన్న రాజ్ నాథ్ సింగ్
- కేంద్రంపై విపక్షాల విమర్శలు
- తిప్పికొట్టిన రాజ్ నాథ్



**న్యూఢిల్లీ జూలై 28(సిద్దిపేట పవర్):**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఆపరేషన్ సిందూర్' పై లోక్‌సభలో విపక్షాలు అడిగిన ప్రశ్నల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ పై పార్లమెంటులో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విపక్ష ఎంపీలు ఈ ఆపరేషన్‌లో భారత సైనికులకు జరిగిన నష్టం గురించి, ఎన్ని భారత విమానాలు కూల్చివేతకు గురయ్యాయి అనే దాని గురించి మాత్రమే ప్రశ్నించారని విమర్శించారు. ఇటువంటి ప్రశ్నలు దేశ ప్రజల మనోభావాలను ఏ మాత్రం ప్రతిబింబించవని సింగ్ అన్నారు.

రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ విజయాన్ని గట్టిగా నొక్కి చెప్పారు. ఈ ఆపరేషన్‌లో ఒక్క భారతీయ సైనికుడికి కూడా హాని జరగలేదని ఆయన స్పష్టం చేశారు. "భారత సైన్యం ఎన్ని శత్రు విమానాలను కూల్చివేసింది? ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం అయ్యాయా?" వంటి ప్రశ్నలు విపక్షం ఎందుకు అడగలేదని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఈ వారు ఈ ప్రశ్నలు అడిగితే తమ వద్ద స్పష్టమైన సమాధానాలు ఉన్నాయని అన్నారు.

జాతీయ భద్రతపై దృష్టి సారించాలని, సాయుధ దళాల స్థైర్యాన్ని దెబ్బతీయవద్దని ఆయన ప్రతిపక్షానికి సూచించారు. ఆపరేషన్ విజయం గురించి ఇప్పటికే తెలియజేసినట్లు ఆయన పునరుద్ఘాటించారు. ప్రతిపక్షం ప్రజా సమస్యలకు సంబంధించిన అర్థవంతమైన, బాధ్యతాయుతమైన ప్రశ్నలు అడగడమే వారి పాత్ర అని సింగ్ అన్నారు.

# నెలరోజులైనా 'సిగాచి' బాధితులకు అందని పరిహారం..

- సిగాచీ పరిశ్రమ ప్రమాద బాధితులకు పరిహార అందలేదన్న హరీశ్ రావు
- బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలని అదనపు కలెక్టర్‌ను కలిసిన హరీశ్ రావు
- పరిహారం అందకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారన్న మాజీ మంత్రి



**హైదరాబాద్ జూలై 28(సిద్దిపేట పవర్):**

సిగాచీ పరిశ్రమలో పేలుళ్లు సంభవించి 54 మంది మరణించారని, ఈ దుర్ఘటన జరిగి నెలరోజులైనా బాధిత కుటుంబాలకు పరిహారం అందలేదని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం బాధిత కుటుంబాలతో కలిసి ఆయన సంగారెడ్డి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కడ అడిషనల్ కలెక్టర్‌ను కలిసి.. బాధిత కుటుంబాలకు మృతదేహాలను అందించడంలో, పరిహారం అందించడంలో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీశారు.

ఆ తర్వాత హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. 'సిగాచి ఘటన జరిగి నెల రోజులు కావొస్తున్నది. బాధిత కుటుంబాలు కన్నీళ్ల మధ్య నెలమాసికాలు చేసుకుంటున్నారు. ఘటన జరిగినప్పుడు సీఎం వచ్చి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఇప్పటికి నెల రోజులు అయ్యింది. ఒక్కరికి కూడా ఎక్స్‌గ్రేషియా అందలేదు. అంతిమ కార్యక్రమాలు జరిపేందుకు శవాలు కూడా ఇవ్వని దుస్థితి ఉంది. బూడిదను తీసుకువెళ్లి గోదావరిలో కలుపుకున్నమని బాధితులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఉమ్మడి ఏపీలో, మన రాష్ట్రంలో ఇంత దారుణమైన ప్రమాద ఘటన ఎన్నడూ జరగలేదు. 54 మంది చనిపోతే ప్రభుత్వ స్పందన అత్యంత దయనీయంగా ఉంది. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యం. ఎక్స్ గ్రేషియా, డెత్ సర్టిఫికెట్ ఎప్పుడు ఇస్తారని అడిగితే.. ఎస్ఎల్బీసీ ఘటనలో శవాలు కూడా దొరకలేదు, మీకు బూడిదైనా దొరికిందని అత్యంత అమానవీయంగా మాట్లాడుతున్నారని బాధితులు చెబుతున్నారు. ఏపీ, బీహార్, జార్ఖండ్, యూపీ నుంచి వచ్చి ఉండాలంటే 20 నుంచి 30 వేలు ఖర్చవుతుందని బాధితుల కుటుంబసభ్యులు బాధపడుతున్నారు.

తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 లక్షలు ఇచ్చి, నెలనెలా వేతనం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు. నెల గడిచినా ఎంతమంది చనిపోయారు, ఎంతమంది క్షతగాత్రులు అనే విషయాన్ని అధికారికంగా వెల్లడించలేదు. చనిపోయినవారి పేర్లు, ఎవరెవరికి ఎంత ఇచ్చారు, క్షతగాత్రులకు ఎంత ఇచ్చారు అనేది ఈ ప్రభుత్వం ఎందుకు దాచి పెడుతున్నది..? ఇప్పటివరకు నష్ట పరిహారం వివరాలు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారో సమాధానం చెప్పాలి. చనిపోయిన జగన్మోహన్ కొడుకు యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదులో.. సిగాచి కంపెనీలో పాత మిషన్ వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని అనేకసార్లు కార్మికులు చెప్పినా, కంపెనీ పట్టించుకోలేదని పేర్కొన్నారు. అంటే యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యంగా ఉంది. ఎందుకు యాజమాన్యం మీద కేసు పెట్టలేదు. ఫిర్యాదులో స్పష్టంగా ఉంది. ఎఫ్ఐఆర్ కూడా అయ్యింది. ఎందుకు యాజమాన్యాన్ని కాపాడుతున్నవు రేవంత్ రెడ్డి..? ఎందుకు యాజమాన్యంతో కుమ్మక్కు అయ్యావు..? కంపెనీతో ఉన్న లాలూచి ఏమిటి? బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. శవాలు ఇవ్వకుండా 8 మంది మిస్సింగ్ అంటూ ఎందుకు వేధిస్తున్నారు. వెంటనే డెత్ సర్టిఫికెట్ ఇచ్చి, ఆ కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

'మేం అందరం డిమాండ్ చేస్తే తెల్లారి మెల్లగ సీఎం వచ్చి, మీడియా ముందు ఫోజులు కొట్టిండు. కంపెనీని తిట్టినట్లు బిల్డప్ ఇచ్చి పోయిండు. కోటి ఎవరు ఇస్తారు..? ప్రభుత్వమా, కంపెనీనా..? అని మీడియా అడిగితే ఎవరు ఇస్తే ఏందని ఆ రోజు సీఎం దబాయించిండు. కంపెనీ కూడా 15 రోజుల్లో పరిహారం ఇస్తామని పత్రికా ప్రకటన ఇచ్చింది. ఇప్పటికీ దిక్కులేదు. ఏపీలో 2024 ఆగస్టు 20న అనకాపల్లిలో ఓ కంపెనీలో ప్రమాదం జరిగి 17 మంది మరణించారు. పలువురికి గాయాలయ్యాయి. వారికి మూడు రోజుల్లో పరిహారం అందించారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు, తీవ్రంగా గాయపడితే రూ.50 లక్షలు, తక్కువగా గాయపడితే రూ.25 లక్షలు పరిహారం ఇచ్చారు. అక్కడ మూడు రోజుల్లో ఇస్తే, ఇక్కడ నెల రోజులు గడిచింది. అయినా ఎందుకు ఇవ్వడం లేదు. ఇచ్చిన హామీ మేరకు మరణించిన వారి కుటుంబాలకు కోటి రూపాయలు, తీవ్రంగా గాయపడితే రూ.50 లక్షలు. తక్కువగా గాయపడితే రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

# బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం

- నిన్నైనా, రేపైనా న్యాయమైన కోటా ఇచ్చేది కేసీఆరే
- మాట తప్పిన కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలి
- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బంపర్ మెజార్టీతో గెలిపిస్తేనే రేవంత్ ప్రభుత్వం సెట్‌రైట్ అవుతది
- పరకాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గిఫ్ట్ ఏ స్మైల్'
- మహిళలకు కుట్టుమిషన్లు, కేసీఆర్ కిట్ల పంపిణీ

**హైదరాబాద్ జూలై 28(సిద్దిపేట పవర్):**

బీసీలకు రాజకీయ పదవుల్లో న్యాయం చేసేది బీఆర్ఎస్సేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు స్పష్టంచేశారు. కేసీఆర్ గతంలో బహుజనులకు అధిక సీట్లు కేటాయించి న్యాయం చేశారని, రేపు కూడా వారికి న్యాయమైన వాటా ఇచ్చి న్యాయం చేసేది బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం హనుమకొండ జిల్లా పరకాలలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 500 మంది మహిళలకు కుట్టుమిషన్లు, వంద మందికి కేసీఆర్ కిట్లను కేటీఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుతమైన మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు సెట్‌రైట్ అవుతారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులకు సమ్మకసారక, రాణీరుద్రమ వారసురాళ్లయిన వరంగల్ ఆడబిడ్డలు కర్రు కాల్చివాత పెట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ కండువా కప్పుకొని మీ ఇంటికి వచ్చే బీఆర్ఎస్ క్యాడర్‌ను కేసీఆరే వచ్చిండని భావించి కడుపులో పెట్టుకొని ఆశీర్వదించాలని కోరారు. పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా గత ఎన్నికల్లోనే 55 ఎంపీటీసీల్లో 32 స్థానాలను అంటే 58% టికెట్లను రేవంత్‌రెడ్డి గాఢనిద్రలో ఉన్నప్పుడే బీసీలకు ఇచ్చామని తెలిపారు. 109 సర్పంచ్ స్థానాల్లో 49 స్థానాలను బీసీలకు ఇచ్చామని, ఆరు జెడ్పీటీసీలో 3, ఆరు ఎంపీపీలో 3 స్థానాలను బహుజనులకే ఇచ్చామని వివరించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంలోనే యూరియా కొరత**

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జనవరిలోనే ఎరువులు తెప్పించి బఫర్‌స్టాక్ పెట్టేవారని, అందుకే ఆయన సీఎంగా ఉన్నన్ని రోజులు యూరియా దుకాణాల ఎదుట లైన్‌లో చెప్పులు, ఆధార్‌కార్డులు కనిపించలేదని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే యూరియా కొరత రైతులను వేధిస్తున్నదని విమర్శించారు. సమయానికి యూరియా, ఎరువులు, విత్తనాలు ఇవ్వలేని ముఖ్యమంత్రికి పదవిలో ఉండే అర్హత లేదని దుయ్యబట్టారు. రేవంత్ ప్రభుత్వానికి ఎన్నికలు వస్తేనే రైతుబంధు గుర్తుకొస్తున్నదని, పార్లమెంటు ఎన్నికలప్పుడు రైతుబంధు వేసి, ఇప్పుడు పంచాయతీ ఎన్నికలు ఉన్నందున మళ్లీ రైతుబంధు వేసిందని విమర్శించారు.

కోటిమంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. తెలంగాణలోని ప్రతి ఆడబిడ్డకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేలు, యువతులకు స్కూటీ బాకీ ఉన్నదని వివరించారు. చారాణా కోడికి బారాణా మసాలా అన్నట్టు స్వయం సహాయక బృందాలకు రూ.3వేల కోట్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. కేవలం రూ.300 కోట్లు ఇచ్చి సంబురాలు చేసుకోమంటున్నదని ఎద్దేవా చేశారు. పరకాల నియోజకవర్గంలో ఇండ్లు నిర్మించుకున్న మూడు వేల మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం సతాయిస్తున్నదని, లబ్ధిదారుల తరపున మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి కోర్టుకుపోతే, న్యాయస్థానం చెప్పినా రేవంత్ ప్రభుత్వం స్పందించడం లేదని దుయ్యబట్టారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు న్యాయం జరిగేదాకా పోరాడుతామని, అవసరమైతే అసెంబ్లీలో కొట్లాడుతామని చెప్పారు.

**జిల్లాకో లీగల్ సెల్**

ప్రతి జిల్లాకు ఒక లీగల్‌సెల్‌ను ఏర్పాటుచేస్తామని పార్టీ కార్యకర్తలకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని అక్రమ కేసులు పెడుతుందని, భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రతి జిల్లాకు బీఆర్ఎస్ లీగల్‌సెల్ ఉంటుందని, అక్రమ కేసులపై న్యాయపరంగా కొట్లాడుతుందని తెలిపారు. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ విద్యార్థి విభాగం తరహాలో పార్టీలోని అన్ని విభాగాలకు శిక్షణ తరగతులను నిర్వహిస్తామని వెల్లడించారు.

**సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు**

సింగరేణిని ప్రైవేట్‌పరం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఆ పార్టీలకు తెలంగాణ మీద ప్రేమలేదని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు కొట్లాడేది బీఆర్ఎస్ దళమేనని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే మంత్రంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇంట గెలిచి రచ్చ గెలువాలి అన్నట్టు ఎంత పెద్ద నాయకుడైనా తన మండలంలోని అన్ని సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను గెలిపించుకోవాలని సూచించారు.





# పాలన గాలికి.. ప్రగతి కాటికి..
## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం

- **మద్యం దుకాణాలను పల్లెలకు విస్తరించాలన్న కాంగ్రెస్ నిర్ణయంపై కేటీఆర్ ఫైర్**
- **ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకుందని విమర్శ**
- **నాడు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని ఆగ్రహం**



**హైదరాబాద్ జూలై 28(సిద్దిపేట పవర్):**

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ.. మేజర్ పంచాయతీల వరకే పరిమితమైన మద్యం దుకాణాలను పల్లెలకు విస్తరించాలన్న రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకుందని దుయ్యబట్టారు. నాడు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని విమర్శించారు. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు కుట్ర పన్నుతుందని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన పోస్టు పెట్టారు.

"నాడు కేసీఆర్ పాలనలో పల్లె, పల్లెకు ప్రగతి రథచక్రాలు. ప్రతి చేనుకు నీళ్లు.. ప్రతి చేతికి పని. ఇంటింటికి తాగునీళ్లు.. ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతిబాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె, పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాలలో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి .. ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్.

ఏడాది క్రితం సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ.897. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యం మీద చేస్తున్న ఖర్చు రూ.1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, ధరఖాస్తు ధర రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయం. నాడు మద్యం అమ్మకాలపై విమర్శలు, నేడు అధికారం దక్కించుకుని ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్న కాంగ్రెస్ సర్కార్. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం. పాలన గాలికి.. ప్రగతి కాటికి" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మీనాక్షి నటరాజన్ పాదయాత్ర షెడ్యూల్ విడుదల

- **ఈనెల 31 నుంచి నియోజకవర్గాల్లో మీనాక్షి నటరాజన్ పాదయాత్రలు**
- **పరిగి నుంచి పాదయాత్ర ప్రారంభించనున్న ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్**
- **ప్రతి నియోజకవర్గంలో 8 నుంచి 10 కి.మీ పాదయాత్ర**
- **వారం రోజుల పాటు కొనసాగనున్న మీనాక్షి నటరాజన్ పాదయాత్రలు**



**హైదరాబాద్ జూలై 28(సిద్దిపేట పవర్):**

తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా పాదయాత్రలను ప్రారంభించబోతున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు వివిధ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, శ్రమదానం కార్యక్రమాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

పాదయాత్రల షెడ్యూల్ ప్రకారం, జూలై 31న పరిగి పట్టణంలో సాయంత్రం పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర అనంతరం పరిగి లో రాత్రి బస చేయనున్నారు. ఆగస్టు 1న ఉదయం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం ఆంధోల్ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తారు.

ఆగస్టు 2న శ్రమదానం కార్యక్రమంతోపాటు కార్యకర్తల సమావేశం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఆర్మూరు లో పాదయాత్ర చేపడతారు. ఆగస్టు 3న ఉదయం శ్రమదానం నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఖానాపూర్ లో పాదయాత్ర ఉంటుంది.

ఆగస్టు 4న ఉదయం శ్రమదానం అనంతరం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం చొప్పదండి లో పాదయాత్ర చేసి రాత్రి బస చేస్తారు. ఆగస్టు 5న ఉదయం శ్రమదానం అనంతరం సమావేశం నిర్వహించి, సాయంత్రం వర్ధన్నపేట లో పాదయాత్ర చేపడతారు. చివరిగా ఆగస్టు 6న శ్రమదానం, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పాదయాత్రలను ముగిస్తారు.




# వరి పంటలో భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా వాడాలి

**భాస్వరం ఎరువులపై ఖర్చు తగ్గించండి**



**నంగునూరు, జులై 28: (సిద్దిపేట పవర్)**

భూమిలోని భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియాను వరి పంటలో వినియోగించి భాస్వరం ఎరువులపై చేసే ఖర్చును తగ్గించుకోవాలని తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. సిహెచ్.పల్లవి రైతులకు సూచించారు. తోర్నాల ఏరువాక కేంద్రం, అధ్వర్యంలో సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయిలో సోమవారం భూమిలోని భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియాపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా.సిహెచ్.పల్లవి మాట్లాడుతూ భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా భూమిలోని భాస్వరాన్ని మొక్కలకు అందుబాటులోకి తెస్తుందని అన్నారు. ఇది భూమిలో పేరుకు పోయిన భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందుబాటులోకి తీసుకు వస్తుందని తెలియజేశారు. రెండు కిలోల పీఎస్బీ ని విత్తన శుద్ధి ద్వారా గానీ, నారు కట్టలు ముంచే పద్ధతి ద్వారా గానీ, ప్రధాన పొలంలో పశువుల ఎరువుతో కలిపి చల్లడం ద్వారా గానీ ఏదో ఒక పద్ధతిని అనుసరించి వినియోగించవచ్చని తెలిపారు. దీనివల్ల భూమిలో పేరుకు పోయిన భాస్వరాన్ని కరిగించడమే కాకుండా భాస్వరం ఎరువులపై పెట్టే ఖర్చును తగ్గించుకోవచ్చు అని తెలియజేశారు. నారు కట్టలు ముంచే పద్ధతిలో అయితే కిలో పీఎస్బీ లేదా 500 మిల్లీలీటర్లు పీఎస్బీ ద్రావణాన్ని 20 నుంచి 25 లీటర్ల నీటిలో కలిపి మిశ్రమ ద్రావణాన్నితయారు చేసుకోవాలని చెప్పారు. ఎకరానికి సరిపడే నారు కట్టలను ఇరవై నిమిషాల పాటు ముంచాలని చెప్పారు. తర్వాత నాటు వేసుకోవాలని రైతులకు తెలియజేశారు. ప్రధాన పొలంలో వాడే పద్ధతులో అయితే వంద కిలోల పశువుల ఎరువులో రెండు నుంచి మూడు కిలోల పీఎస్బీ లేదా ఒక లీటరు పీఎస్బీ ద్రావణాన్ని కలిపి ఒక ఎకరం పొలంలో చల్లుకోవాలని తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. సిహెచ్. పల్లవి రైతులకు సూచించారు. అనంతరం ముండ్రాయికి చెందిన రైతు సల్లారం దుర్గారెడ్డి పొలంలో ఫాస్ఫేట్ ను కరిగించే బ్యాక్టీరియా వినియోగంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, నాలుగు నెలల ఆర్ఏడబ్ల్యూఈపీ (గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం) లో భాగంగా సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల బాబూ జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు దాక్షాయని, అర్చన, గాయత్రి, హుమా నజమ్, సుమయ్య, అలేఖ్య రెడ్డి పాల్గొన్నారు.

# ఒక్క కమిటీ.. వంద చిక్కులు!

- దేశ సాగునీటి రంగంలో బనకచర్ల చిచ్చు
- చట్టాలు, ట్రిబ్యునళ్ల మనుగడ ప్రశ్నార్థకం
- వాటిని అపహాస్యం చేసేలా రేవంత్ ప్రతిపాదన
- కమిటీలతో తేలితే అంతర్రాష్ట్ర చట్టమెందుకు?
- 2 రాష్ట్రాల ఇంజినీర్లు మిగులును తేలుస్తరా?
- మిగులుపై కడితే కేటాయింపులకు రక్షణేది?
- బనకచర్ల కమిటీపై నిపుణుల్లో ఆందోళన
- రాష్ట్రానికి మరో మరణశాసనమని హెచ్చరిక



**హైదరాబాద్ జూలై 28(సిద్దిపేట పవర్):**

తెలుగు గంగ ప్రాజెక్టు.. మద్రాసు తాగునీటి కోసం మానవతా దృక్పథంతో కాగితాలపై రూపుదిద్దుకున్న ప్రాజెక్టు ఇది! మరి నిజంగా నాటి మద్రాసు నేటి చెన్నై గొంతును కృష్ణాజలాలు తడుపుతున్నయా? అలాంటప్పుడు తెలుగు గంగ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పోతిరెడ్డిపాడు ద్వారా ఏటా వందలాది టీఎంసీలు ఎక్కడికి పోతున్నయి? ప్రతి సంవత్సరం చెన్నై సమీపంలోని పూంచ్‌కి 15 టీఎంసీలు తరలించేందుకు 1500 క్యూసెక్కుల వరద ప్రవాహంతో చేపట్టిన కాల్వలు ఇప్పుడు నదిని ఎందుకు మళ్లించుకుపోతున్నయ్? నాటి తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో 'రాష్ట్ర ప్రయోజనాలు' అనే సోయి లేకపోవడంతోనే రాష్ట్ర రైతాంగానికి ఇప్పుడు పోతిరెడ్డిపాడు ఒక భూతంలా తయారైంది.

అయినా తెలంగాణ కాంగ్రెస్ కనీసం చరిత్ర నుంచైనా గుణపాఠాలు నేర్చుకోవడం లేదు. చంద్రబాబు రచించిన బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ కమిటీని ప్రతిపాదించడమే ఇందుకు నిదర్శనం. బనకచర్లను అంగీకరించడమంటేనే తెలంగాణకు గోదావరిజలాల్లో మరణ శాసనాన్ని లిఖించడమేనన్న నోటితోనే రెండు రాష్ట్రాలతో కమిటీ వేయడమే కాదు.. మనం వేసిన కమిటీ కాబట్టి అది చెప్పినట్టు వినాలి కదా? అంటూ ముఖ్యమంత్రే తెలంగాణకు మరణశాసనాన్ని లిఖించడం మొదలుపెట్టారని సాగునీటి రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని ఏ రాష్ట్రమైనా నదీజలాల్లో అన్యాయానికి గురికాకుండా ఉండేందుకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కవచాలను ఈ కమిటీ ప్రతిపాదనతో సీఎం రేవంత్ అపహాస్యం చేశారని మండిపడుతున్నారు. సాగునీటి రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు నదీజలాలపై మనం చేసుకున్న చట్టాలు, రూపొందించుకున్న ట్రిబ్యునళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నాయా?

**రాజ్యాంగబద్ధమైన ట్రిబ్యునల్ ఎందుకు?**

సాగునీటి రంగంలో వరదజలాలు అంటే ఎగువ నుంచి దిగువకు పొంగిపొర్లే నీళ్లు. ఈ జలాల్లో నికర జలాలు, మిగులు జలాలూ ఉంటాయి. నదుల్లో ఎగువన మొదలైన వరద ఇన్‌ఫ్లో రూపంలో ప్రాజెక్టుల్లోకి వచ్చి.. అక్కడ గేట్లు ఎత్తితే దిగువకు ప్రవహిస్తుంది. అంతిమంగా సముద్రంలో కలుస్తుంది. గోదావరి బేసిన్‌ను తీసుకుంటే 75 శాతం డిపెండబులిటీపై బేసిన్‌లోని ఏడు రాష్ట్రాలు తమ ప్రాజెక్టుల ఆధారంగా చేసుకున్న కేటాయింపులకు బచావత్ ట్రిబ్యునల్ అధికారికంగా ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సముద్రంలో కలిసే గోదావరిజలాల్లో 75 శాతం డిపెండబులిటీపై జరిగిన కేటాయింపులు ఉన్నాయి. అంతకంటే ఎక్కువగా కూడా ఉండొచ్చు.

కానీ అది ఎంత అనేది ఇప్పటిదాకా శాస్త్రీయంగా తేలలేదు. కృష్ణాజలాల్లో 75 శాతం డిపెండబులిటీపై బేసిన్ రాష్ట్రాలకు బచావత్ 1976లో కేటాయింపులు చేసినపుడు నీటి పరిమాణాన్ని 2,060 టీఎంసీలుగా తేల్చింది. ఆ తర్వాత బ్రిజేష్ ట్రిబ్యునల్ 65 శాతం డిపెండబులిటీపై చేసిన అధ్యయనంలో నీటి పరిమాణాన్ని 2,578 టీఎంసీలుగా చూపారు. అంటే బచావత్ (75 శాతం డిపెండబులిటీ) సమయంలో కంటే బ్రిజేష్ (65 శాతం డిపెండబులిటీ) ట్రిబ్యునల్ సమయంలో 448 టీఎంసీలు ఎక్కువగా తేలాయి. గోదావరిజలాల పంపిణీలో భాగంగా అప్పటికి అన్ని రాష్ట్రాలు చేసుకున్న ఒప్పందాలు, ఇతరత్రా సాంకేతిక అంశాలన్నింటినీ పరిగణలోనికి తీసుకుని (75 శాతం డిపెండబులిటీ) బచావత్ ఆమోద ముద్ర వేశారు.

అందులో భాగంగానే ఉమ్మడి ఏపీకి దక్కిన 1,480 టీఎంసీల గోదావరి జలాల్లో తెలంగాణకు 968 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీలు దక్కాయి. మరి 65 శాతం డిపెండబులిటీపై అధ్యయనం జరిగితే ఇంతకంటే ఎంత నీటి పరిమాణం ఎక్కువగా ఉందో తేలుతుంది. ఆ మేరకు కేంద్రం ట్రిబ్యునల్ వేసి.. అధ్యయనం చేసి.. నీటి పరిమాణాన్ని తేల్చితే ఆ నీటిని మిగులుజలాలుగా పరిగణించవచ్చు. కానీ ఇప్పటివరకు అదేమీ జరగలేదంటే గోదావరిలో మిగులు అనేది ఉన్నదా? లేదా? అని శాస్త్రీయంగా తేలలేదు. ఏటా 3వేల టీఎంసీల వరకు గోదావరిజలాలు సముద్రంలో కలుస్తున్నాయనేది వాస్తవమైనప్పటికీ అవి కేటాయింపుల్లోని పరిమాణమా? అంతకంటే మించినదా? అనేది శాస్త్రీయంగా తేలాలి. అందుకోసమే రాజ్యాంగబద్ధంగా కేంద్రం ట్రిబ్యునల్ వేయాలి. కానీ రెండు రాష్ట్రాల మధ్య వేసిన కమిటీ మిగులు ఉందని తేల్చితే రాజ్యాంగబద్ధమైన ట్రిబ్యునళ్లకు అర్థం లేకుండా పోతుంది. చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నివేదికలో వరద, మిగులుజలాలు అని ప్రస్తావించారు. దీన్ని ఎత్తి చూపాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి అది చేయకపోగా కమిటీని ప్రతిపాదించారు. తద్వారా దీనిని ఆదర్శంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వాలు ఏ నదీ బేసిన్లలోనైనా రెండు రాష్ట్రాలను కూర్చోబెట్టి ఓ కమిటీ వేసి మిగులుజలాల లెక్క తేల్చితే బాధిత రాష్ట్రాల గోడు వినేదెవరు?

**ఐఎస్ఆర్‌డబ్ల్యూ చట్టానికి అర్థమేమున్నది?**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 262 ప్రకారం అంతర్రాష్ట్ర నదీ వివాదాల (ఐఎస్ఆర్‌డబ్ల్యూ) చట్టం 1956 రూపుదిద్దుకున్నది. 'ఒక రాష్ట్రం చేసే చర్య ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఇతర రాష్ట్రాల ప్రయోజనాలను ప్రభావితం చేస్తే అది ఐఎస్ఆర్‌డబ్ల్యూ వివాదాల చట్టం1956 చట్టం పరిధిలోకి వస్తుంది. ఆంధ్రప్రదేశ్ రూపొందించిన బనకచర్ల ప్రాజెక్టును వరద/మిగులు జలాల ఆధారంగా చేపడతామని ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు చెప్తున్నారు. అంటే బేసిన్‌లోని ఏడు రాష్ట్రాలు కుదుర్చుకున్న ఒప్పందం.. బచావత్ ఆమోదం మేరకు 'గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్‌జీడబ్ల్యూడీటీ' కేటాయించిన దాని కంటే ఎక్కువ నీటిని వాడుకునేందుకు ఏపీ సిద్ధమైంది. ఇతర ప్రాజెక్టుల ద్వారా తన కేటాయింపులను వాడుకుని, అంతకుమించిన జలాలు వాడుకునేందుకు రూపొందించిన బనకచర్లకు వరద/మిగులుజలాలను వాడుకుంటానంటున్నది.

అంటే గతంలో ఏడు రాష్ట్రాలు వేసుకున్న వాటాల కంటే ఎక్కువ వాడుకోవాలంటే అదేం తో తేల్చి--- దానిని అన్ని రాష్ట్రాలకు పంచాలి. ఇప్పుడు చంద్రబాబు చెబుతున్న ఆ మిగులుజలాలు ఎంత? ఎవరి వాటా ఎంత? అని తేల్చాల్సింది ట్రిబ్యునల్ తప్ప కేంద్రం కూడా కాదు. అందుకే ఐఆర్‌డబ్ల్యూడీ1956 చట్టం ప్రకారం బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల అభిప్రాయాల్ని తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రానిది. కానీ ఆ చట్టాన్ని తుంగలో తొక్కి కేవలం రెండు రాష్ట్రాలను పిలిచి కూర్చోబెడితే రాజ్యాంగబద్ధమైన అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టానికి అర్థమేమున్నది? కేంద్రం చట్టానికి తూట్లు పొడిస్తే ప్రశ్నించాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి దానికి ప్రత్యామ్నాయంగా కమిటీని ప్రతిపాదించారు. తద్వారా కేంద్ర ప్రభుత్వాలు నదీజలాల అంశాల్లో ఏ రాష్ట్రానికి సమస్య వచ్చినా సరే! అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టాన్ని కాదని కమిటీ వేసి తన రాజకీయ ప్రయోజనాలకు పట్టం కడుతుంది.

**ట్రిబ్యునళ్ల కేటాయింపులకు రక్షణ ఏది?**

ఆయా నదీ బేసిన్లలోని రాష్ట్రాలకు జలాల పంపిణీ కోసం గతంలో కేంద్ర ప్రభుత్వాలు ట్రిబ్యునళ్లను వేశాయి. కేటాయింపుల ప్రక్రియను పూర్తి చేశాయి. వివాదాలు ఉన్నా సరే.. వాటి ప్రకారమే చాలావరకు నదీజలాల పంపిణీ కొనసాగుతున్నది. అందులో భాగంగానే కృష్ణా, గోదావరి నదీ బేసిన్లలోని రాష్ట్రాలు జలాలను వాడుకోవడంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపడుతున్నాయి. అట్లయితే ఆయా ప్రాజెక్టులకు చట్టబద్ధత వస్తుంది. ముఖ్యంగా కేంద్ర అనుమతులు, నిధులు వస్తాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వాలు ఆ మోదం తెలిపిన సాగునీటి ప్రాజెక్టులకు మొదటి ప్రామాణికత.. నికర నీటి కేటాయింపు! సంబంధిత రాష్ట్రానికి ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులకు లోబడి ఆ రాష్ట్రం ప్రాజెక్టును చేపడితేనే కేంద్ర జల సంఘం సిఫార్సు చేస్తుంది.

దాని పరిధిలోని ఇతర విభాగాలు అనుమతులిస్తాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిధులకు అంగీకరిస్తుంది. మరి.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ పొందించిన బనకచర్లకు ట్రిబ్యునల్ కేటాయింపులు ఉన్నాయా? లేవని.. అందుకు మిగులు జలాల ఆధారంగా ఈ ప్రాజెక్టు చేపడతానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సెలవిచ్చారు. అలాంటప్పుడు ఇప్పటివరకు మిగులు జలాల ఆధారంగా కేంద్రం ఏ ఒక్క ప్రాజెక్టుకైనా అనుమతినిచ్చిందా? ఇస్తేగిస్తే బనకచర్లనే తొలి ప్రాజెక్టుగా చరిత్ర పుటల్లోకి ఎక్కుతుంది. దీంతో రాష్ట్రాలు సముద్రంలో కలిసే జలాలను చూపి కొత్త సాగునీటి ప్రాజెక్టులను నిర్మించుకుంటూ పోతే ఇతర రాష్ట్రాలకు ఉన్న ట్రిబ్యునల్ కేటాయింపులకు రక్షణ ఎలా ఉంటుంది? దేశ చరిత్రలోనే లేని కొత్త సంప్రదాయం ఎందుకు తీసుకువస్తున్నారంటూ అటు కేంద్రం, ఇటు చంద్రబాబును ప్రశ్నించాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి కమిటీని ప్రతిపాదించారు. తద్వారా ఇకముందు ఏ రాష్ట్రమైనా కేటాయింపులు లేకున్నా సముద్రంలో కలిసే నీటిని ప్రామాణికంగా తీసుకొని ప్రాజెక్టులకు అనుమతి కోరితే కేంద్ర ప్రభుత్వాలు కమిటీ వేసి వాటికి ఆమోదం తెలిపితే మిగిలిన రాష్ట్రాల అన్యాయాన్ని పట్టించుకునేదెవరు?

**పునర్విభజన చట్టానికి పుట్టగతులుంటాయా?**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం పార్లమెంటు ఆమోదంతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. అందుకు అనుగుణంగా ఏపీ పునర్విభజన చట్టం2014 రూపుదిద్దుకున్నది. 2014, జూన్ 2 నుంచి ఇది అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలకు నదీజలాల అంశాలను పరిష్కరించుకునేందుకు మార్గదర్శకాలను సూచించారు. కృష్ణా, గోదావరి బేసిన్లకు సంబంధించి ఆయా నదీ యాజమాన్య బోర్డులను ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా సమస్య పరిష్కారం కాకపోతే కేంద్ర జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన అపెక్స్ కౌన్సిల్‌లో పరిష్కరించుకోవాలని పొందుపరిచారు. అయినా అన్యాయం జరిగిందని అనుకుంటే దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే వెసులుబాటు ఉన్నది.

కేవలం సమస్యల పరిష్కారమే కాదు, కొత్త సాగునీటి ప్రాజెక్టులు, జలాల పంపిణీని సైతం ఈ వేదికలపైనే పంచుకోవాలి. దీని ప్రకారం చంద్రబాబు రూపొందించిన బనకచర్ల ప్రాజెక్టు తొలుత గోదావరి నదీ యాజమాన్య బోర్డు పరిధిలోకి రావాలి. ఆపై అపెక్స్‌కు వెళ్లాలి. తెలంగాణ బనకచర్లను వ్యతిరేకిస్తున్నందున రేవంత్ ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించే స్వేచ్ఛ కూడా ఉంది. కానీ సీఎం రేవంత్‌రెడ్డి పునర్విభజన చట్టాన్ని గౌరవించకుండా కమిటీని ప్రతిపాదించారు. తద్వారా కేంద్ర ప్రభుత్వాలు భవిష్యత్తులోనూ ఏపీ పునర్విభజన చట్టం2014కు ప్రత్యామ్నాయంగా కమిటీలను వేసి పరిష్కారాలు చూపిస్తే.. పునర్విభజన చట్టాన్ని అమలు చేయండి అనే హక్కు తెలంగాణకు ఉంటుందా?

**రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా?**

కేంద్ర ప్రభుత్వం..చట్టాలు.. ట్రిబ్యునళ్లు.. ఇవన్నీ ఎలా ఉన్నా! ఏ రాజకీయ నాయకుడికైనా తన ప్రాంత ప్రయోజనాలు అనేది మొదటి ప్రాధాన్యంగా ఉండాలి. ఆ సోయి లేకపోవడంతోనే తెలంగాణ కాంగ్రెస్ నేతలు తెలుగు గంగ కాల్వకు తలూపితే అది పోతిరెడ్డిపాడుగా తయారైంది. కనీసం అప్పటికైనా కండ్లు తెరవకుండా మంగళహారతులు పట్టడంతో ఇప్పుడు ఇంతింతై.. అన్నట్టుగా కృష్ణా నదినే చెరబడుతున్నది. నాడు కేవలం ఒక ప్రాంత నేతలు, ప్రజాప్రతినిధులే! కానీ ఇప్పుడు ప్రజలు ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఉన్న తెలంగాణకు ప్రజలు వారిని ఏలికలుగా అధికారంలో కూర్చోబెట్టారు. అయినా ఈ ప్రాంత ప్రయోజనాలు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు బనకచర్లతో తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందనేది ఇప్పుడు రాష్ట్రంలో ఏ విద్యార్థిని అడిగినా.. రాజకీయ నాయకుడిని తట్టినా.. రైతులను పలకరించినా చెప్తారు.

పైగా సీఎం రేవంత్ స్వయంగా బనకచర్లను వ్యతిరేకించడమే కాకుండా ఎజెండాగా ఆ అంశం వస్తే బాయ్‌కాట్ చేస్తానన్నారు. కానీ ఇచ్చిన మాటను ఇక్కడే వదిలి విమానం ఎక్కి హస్తినలో చంద్రబాబుతో రాజీ పడ్డారు. చివరకు తెలంగాణకు కృష్ణాలో పోతిరెడ్డిపాడులా గోదావరిలో బనకచర్ల అనే గుదిబండను కట్టి మరో మరణ శాసనాన్ని లిఖించేందుకు సిద్ధమయ్యారు. బనకచర్లపై కమిటీని ప్రతిపాదించారు. తద్వారా కేంద్ర అనుమతితో ఏపీ చేపట్టే బనకచర్లకు గోదావరి నీటి కేటాయింపు అధికారికమవుతుంది. తెలంగాణ తన కేటాయింపులను వాడుకోకముందే ఏపీ తన వాటా కంటే ఎక్కువ నీటిని కూడా అధికారికంగా వాడుకునే వెసులుబాటు వస్తుంది. గోదావరి బేసిన్‌లోని ఎగువ రాష్ట్రాలు కట్టుకున్న ప్రాజెక్టుల మనుగడ సైతం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉంది.

# వెంకటేశ్వర స్వామి దేవాలయం భూములను కాపాడాలి

**సిద్దిపేట పవర్:**




స్థానిక మోహినిపుర వీధిలో వెలిసిన శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం సంబంధించిన ఆస్తులను కాపాడాలని, అలాగే దేవాలయంలో వంశపార్యం పర ధర్మకర్తగా ఉన్నటువంటి వారికి దేవాలయం తో ఎలాంటి సంబంధం లేదని సిద్దిపేటకు చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు ఉడత మల్లేష్ యాదవ్ తెలిపారు 1975లో దేవాలయం సిద్దిపేటకు చెందిన కొంతమంది పుర ప్రముఖులు పెద్దలు మోహిని పురచెందిన కొంతమంది కలిసి దేవాలయం నిర్మించారు ఈ నిర్మితమైనతమైన దేవాలయం ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరిగింది ఆ సమయంలో రెవెన్యూలో పనిచేస్తున్నటువంటి వెంకట నరసయ్య అధికారాన్ని అడ్డం పెట్టుకొని అప్పటికే 1340 సర్వే నంబర్లు ప్రభుత్వ భూమిఐదు ఎకరాల భూమిని తన పేరు మీద చేయించుకుని ఉన్నాడు ఈఆయన కూడా మోహిని పూరలో నివాసం ఉండడంవల్ల నిర్మాణంలో ఆయన కూడా ఒక భక్తునిగా ఉన్నాడు కానీఅధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎండోమెంట్ శాఖలో తనకు ఉన్న పరిచయంతో దేవాలయం లో తన పేరు మిగతా వారికి ఎవరికి తెలియకుండా రాయించుకున్నాడు దేవాదాయ శాఖ వారు మీరు ఏదైనా ఇస్తేనే మీరు శాశ్వత ట్రస్ట్ గా ఉంటుందని తెలుపగా ఆక్రమించుకున్నటువంటి 1840 సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమిని 5ఎకరాల భూమిని దేవాలయంపై రాసి వంశపార్యపర ధర్మకర్తగా ఉంటున్నాడు ఈ క్రమంలో ఐదు ఎకరాల భూమిలో సాగు చేస్తున్నటువంటి దానికి దేవాలయంకు భక్తులు ఇచ్చిన విరాళాలతో ఖర్చులు చేసి ఐదు ఎకరాల భూమిలో మామిడి తోటలు పండించారు తర్వాత కొన్ని రోజులకు దాన్లో నుండి ఇది మా సొంతమని చెప్పి నాలుగు ఎకరాలు తన కొడుకుల పేరు చేసి మొత్తం అమ్ముకున్నారు దేవాలయం కు ఎలాంటి సంబంధం లేని మీరు ఫండ్రాఫ్ ట్రస్ట్ గా ఎలా ఉంటారు ఒకవేళ ఆ భూమి దేవాలయం అయితే దేవాలయంకే ఉండాలి కాబట్టి దీనిపై సమగ్ర విచారణ జరిపి దేవాలయ ఆస్తులను కాపాడాలని అలాగే 50 సంవత్సరాలుగా సిద్దిపేట ప్రజలను దేవాదాయ శాఖ అధికారులను మభ్యపెట్టి మోసం చేసి వంశపార్యం పర్య ధర్మకర్తగా ఉంటూ దేవాలయానికి భక్తులు ఇచ్చినటువంటి కానుకలు అన్నిటిని తింటూ ప్రజలను మోసం చేసిన వీర కుటుంబం సిద్దిపేట ప్రజలందరికీ క్షమాపణ చెప్పి ధర్మకర్త నుంచి తొలగిపోవాలని ఈరోజు కార్యనిర్వాహణాధికారి గారికి మె మో రండం జరిగింది త్వరలోనే ప్రజా పోరాటం చేసి అన్యాయకరతమవుతున్నటువంటి దేవాలయ ఆస్తులను హక్కులను కాపాడడానికి సిద్దిపేట ప్రజలందరినీ సన్నద్ధం చేస్తాం

## వేముల పోచమ్మ దేవాలయానికి
# బీడీ రోడ్డు మంజూరు చేయాలి

**చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్ కు సిపిఐ వినతి**

**చేర్యాల, జూలై 28 (సిద్దిపేట పవర్)** ముస్త్యాల గ్రామంలో వేముల పోచమ్మ దేవాలయానికి బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతూ సిపిఐ చేర్యాల మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చేర్యాల తహసిల్దార్ దిలీప్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఈరి భూమయ్య మాట్లాడుతూ.. శక్తి మాతగా కొలిచే వేముల పోచమ్మ దేవాలయానికి నిత్యం వందలాది మంది భక్తులు దైవదర్శనానికి వస్తూ వెళ్తుంటారని, మట్టి రోడ్డు కావడంతో వర్షం పడితే అస్తవ్యస్తంగా మారి నడవాలంటే నరకయాతన పడుతున్నారని తెలిపారు. భక్తులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మూడు కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ దిలీప్ నాయక్ స్పందించి వీలైనంత త్వరగా ఆర్ అండ్ బీ, పంచాయత్ రాజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తహసిల్దార్ కు గ్రామస్తులు, సిపిఐ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిరాం భద్రయ్య, పొన్నబోయిన ప్రభాకర్, బింగి రాజు, పుల్ల కుమార్, నర్సిరెడ్డి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల్లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

- సమస్యలు పరిష్కరించకుంటే సెక్రెటరేట్ ను ముట్టడిస్తాం...
- 1 వ వార్డ్ లింగారెడ్డి పల్లి భవన నిర్మాణ రంగా కార్మిక సంఘం.

**సిద్దిపేట పవర్:**

సిద్దిపేట పట్టణంలోని కొండ మల్లయ్య గార్డెన్ లో తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో .రాష్ట్ర భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం అధ్యక్షులు దరి పల్లి చంద్రం, ఆధ్వర్యంలో జరిగే రాష్ట మహా సభకు పెద్ద ఎత్తున ర్యాలీ తో తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ సభ్యులు మాట్ల డుతూ,కార్మికులకు పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్మిక వెల్ఫేర్ బోర్డుకు కార్మిక నాయకున్ని చైర్మన్ చేయాలని డిమాండ్ చేశారు.గతంలో కార్మికులకు రూ 10 లక్షల బీమా ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో బెల్ట్ షాపులను, పర్మిట్ రూములను బంద్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్య క్షులు జీకురు ఎల్లయ్య,ఉపాధ్యక్షులు. తాటికొండ పర్శరాములు,మాజీ అధ్యక్షులు తాటికొండ నర్సింలు,కార్మికులు తాటికొండ కనకయ్య, కదుర్ల ఉప్పలయ్య,ఎల్లయ్య, రాజేలయ్య,రంగ య్య, పర్శరాములు తదితరులు పాల్గొనారు.



# కేజీబివి స్కూల్ లో విద్యార్థులకు చట్టాల పై అవగాహన సదస్సు

- జగదేవపూర్ సబ్ ఇస్పెక్టర్ కృష్ణా రెడ్డి
- సోషల్ మీడియాను అవసరం ఉన్న వరకు ఉపయోగించాలి
- విద్యార్థులు ఇష్టపడి చదవాలి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :**




కేజీబీవీ స్కూల్ జగదేవపూర్ విద్యార్థి నిలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, ఈవిటీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియాల వల్ల కలిగే నష్టాల గురించి గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి అవగాహన కల్పించిన జగదేవపూ ర్ ఎస్ఐ కృష్ణారెడ్డి, గజ్వేల్ షీటీమ్ బృందం అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవ ద్దు. సోషల్ మీడియాను అవసరం ఉన్న వరకు మాత్రమే వాడుకోవాలి. ఇష్టపడి చదివి మీరు అనుకున్న గోల్ సాధించాలి. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యం ఏర్పరచుకొని క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలి గంజాయి ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దు ఈ సందర్భంగా జగదేవపూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్,ఇ విటీజింగ్,పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాద్యత. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాల న్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని సామాజిక రుగ్మతల గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపధ్యాయులు స్ర వంతి,మరియు అధ్యాపకులు ఏఎస్ఐ రమణారెడ్డి, గజ్వేల్ షీటీమ్ బృందం మహేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ లో మహేష్, అనిల్, తది తరులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుకా మాత అమ్మవారిని దర్శించుకున్న దుబ్బాక ఎస్సై కీర్తి రాజు

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూలై, 28 ప్ర-తినిధి**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలో డిఆర్డిఏ ఆదేశాల మేరకు వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన దుబ్బాక ఎస్సై కీర్తి రాజు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మనందరి పైన ఉన్నది కాబట్టి ప్రకృతిని ప్రేమించుకుంటూ పర్యావరణాన్ని కాపాడాలని ఎస్సై తెలిపారు. అదే విధంగా శ్రీ రేణుకా మాత ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు, ఆలయాన్ని దర్శించుకున్న ఎస్సై కీర్తి రాజును ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి బహుమానంగా ఫోటో ఇచ్చి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుకా మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, ఉపాధ్యక్షులు మల్లుగారి ప్రేమ్, కార్యద ర్శి కోంద్ర యాదగిరి, బిట్ల పరశురాములు, గూడ శ్రీకాంత్ రెడ్డి, సద్ది ప్రదీప్ రెడ్డి, గంట అజయ్, జాలిగం నవీన్, రాళ్ల బండి సంపత్ మండల అధికారి టి ఎ మహేందర్, గ్రామపంచాయతీ కార్యదర్శి మురళి, ఫీల్డ్ అసిస్టెంట్ బిక్షపతి, అంగన్వాడి టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# నంగునూరు గ్రామ వాసికి అక్షర కణిక పురస్కారం

**నంగునూర్, జులై 28 ( సిద్దిపేట పవర్ )**

నంగునూరు మండల కేంద్రానికి చెందిన బీసీ గురుకుల ఎంజేపీ తెలుగు అతిథి ఉపా ధ్యాయుడు, దేవులపల్లి రమేశ్ కు అక్షర కణిక పురస్కారం లభించింది. హైదరాబాద్ డి,ఐ ఎమ్,సి డాన్స్ స్టూడియోలో కణిక సాహిత్య సామాజిక సేవ, విద్యారంగ వేదిక, కణిక ఆత్మీయ కలయిక సందర్భంగా సాహిత్య సేవలు అందిస్తున్నందుకు గాను, కణిక వ్యవ స్థాపక అధ్యక్షులు కులకర్ణి రమాదేవి,ద్యాసం సేనాధిపతి, కణిక ప్రధాన కార్యదర్శి విజయ కుమారి, పొర్ల వేణుగోపాల్ చేతులు మీదుగా కవి,రచయిత దేవులపల్లి రమేశ్ ను అక్షర కణిక పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రచయిత దేవులపల్లి రమేశ్, మా ట్లాడుతూ. తన సేవలను గుర్తించి అక్షర కణిక పురస్కారం ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. మన తెలుగు భాషను కాపా డుకోవాల్సిన అవసరం మనందరి మీద ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కణిక సభ్యులు, సత్యనీలిమ, వరలక్ష్మి, సుధా కొలచన,గిరిజ రాణి, సాయి స్రవంతి జాదవ్, కృష్ణకుమారి, భరద్వారాజ్, కవులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.






# జై గణేశ్ భక్తి సమితి రాష్ట్ర కార్యాలయం లో రాష్ట్ర కమిటీ సమావేశం.

**జూలై28, సిద్దిపేట**

జై గణేష భక్తి సమితి రాష్ట్ర సమావేశం హైదరా బాద్ లోని ఆదర్శ నగర్ కాలనీలో నిర్వహించడం జరిగింది.ఈ యొక్క సమావేశంలో వ్యవస్థాపక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జైన్ కుమార్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ గా కోట శంకర్ ఆనంద్ రావుని ని యమించడం జరిగింది. ఇందుకు రాష్ట్ర కమిటీ ఆమోదం తెలిపింది..చైర్మన్ ని ఎన్నుకున్న తదనం తరం జై గణేష్ భక్తి సమితి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకున్నారు..జై గణేష్ భక్తి సమితి ఆధ్వర్యంలో అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వ హించాలని నిర్ణయించారు..నవరాత్రుల్లో భక్తి సేవ కార్యక్రమం చేస్తున్న వారికి అలాగే మట్టి వినాయకు లు పెట్టిన వారికి ఈ అవార్డు ప్రధానము జరుగుతుం ది దీన్ని అందరూ ఆమోదించడం జరిగింది.భవిష్య త్ కార్యక్రమాల గురించి చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమం తదనంతరం ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీ రాజు కుమార్ వారి టీం కు సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని వి జయవంతం చేసినందుకు విచ్చేసిన సభ్యులందరికీ పేరు పేరునా ధన్యవాదాలు అలాగే కే ఎస్. ఆనంద్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు, శుభాకాంక్షలు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరిని జై గణేశ్ భక్తి సమితి మెంబర్ గా చేయాలని, ప్రతి జిల్లా, మండలంలో జై గణేశ్ భక్తి సమితి కమిటి లు పూర్తిగా బాధ్యత తీసుకొని స్వచ్ఛందంగా సేవ చేయాలని, పర్యావ రణ పరిరక్షణకు గణేశ్ భక్తి సమితి సభ్యులందరు కృషిచేయాలని, మట్టి గణపతులు పెట్టే విధంగా మనం కృషి చేయాలని చైర్మెన్ కే ఎస్ ఆనందు రావు గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి జై గణేశ్ భక్తి సమితి కుటుంబ సభ్యులందరికీ జాతీయ వ్యవస్థాపకులు ఏ. జైన్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జై గణేశ భక్తి సమితి జాతీయ వ్యవస్థాపకులు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏ . జైన్ కుమార్,తెలంగాణ రాష్ట్ర ఉమెన్ వింగ్ అధ్యక్షురాలు శ్రీదేవి గౌడ్ ,రాష్ట్ర సలహాదారులు కొత్వాల్ దయానంద్,రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రవికాంత్,రాష్ట్ర కార్యదర్శి బాలరాజు ,రాష్ట్ర కోఆర్డినేటర్,సిద్దిపేట్ జిల్లా ఇన్చార్జ్ పెంటం స్వామి,సంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ నాగ రవళి ,నారాయణపేట జిల్లా ఇన్చార్జ్ సత్యా నంద్ రెడ్డి,కూకట్పల్లి సనత్ నగర్ ఇంచార్జ్ కోటి రెడ్డి ,రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మి ,రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీ శ్రవణ్ ,జయంత్, శ్రీనివాస్ మొదలగు వారు పాల్గొన్నారు.



# నంగునూరు గ్రామ వాసికి అక్షర కణిక పురస్కారం

**నంగునూర్, జులై 28 ( సిద్దిపేట పవర్ )**

నంగునూరు మండల కేంద్రానికి చెందిన బీసీ గురుకుల ఎంజేపీ తెలుగు అతిథి ఉపాధ్యాయుడు, దేవులపల్లి రమేశ్ కు అక్షర కణిక పురస్కారం లభించింది. హైదరాబాద్ డి,ఐఎమ్,సి డాన్స్ స్టూ డియోలో కణిక సాహిత్య సామాజిక సేవ, విద్యా రంగ వేదిక, కణిక ఆత్మీయ కలయిక సందర్భంగా సాహిత్య సేవలు అందిస్తున్నందుకు గాను, కణిక వ్యవస్థాపక అధ్యక్షులు కులకర్ణి రమాదేవి,ద్యాసం సే నాధిపతి, కణిక ప్రధాన కార్యదర్శి విజయ కుమారి, పొర్ల వేణుగోపాల్ చేతులు మీదుగా కవి,రచయిత దేవులపల్లి రమేశ్ ను అక్షర కణిక పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రచయిత దేవులపల్లి రమేశ్, మాట్లాడుతూ. తన సేవలను గుర్తించి అక్షర కణిక పురస్కారం ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం మనందరి మీద ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కణిక సభ్యులు, సత్యనీలిమ, వరలక్ష్మి, సుధా కొలచన,గి రిజ రాణి, సాయి స్రవంతి జాదవ్, కృష్ణకుమారి, భరద్వారాజ్, కవులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.




# కార్మికులను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- కార్మిక వెల్ఫేర్ బోర్డుకు కార్మిక నాయకున్ని చైర్మన్ గా నియమించాలి
- భవన నిర్మాణ కార్మికుల సమస్య పరిష్కరించకుంటే సెక్రెటరేట్ ను మూటడిస్తాం
- భవన నిర్మాణ రంగా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం

**సిద్ది పేట పవర్:** రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల్లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సెక్రె టరేట్ ను ముట్టడిస్తామని భవన నిర్మాణ రంగా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం అన్నారు. సి ద్దిపేట పట్టణంలోని కొండ భూదేవి గార్డెన్ లో ఏర్పాటు చేసిన బి.ఎన్.ఆర్.కె.ఎస్ రాష్ట్ర మహాసభల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గతంలో కార్మికులకు రూ 10 లక్షల బీమా ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగిందని దానికి వెంటనే అమలు చేయాలన్నారు.కార్మికులు మద్యాన్ని బానిస లుగా మరవద్దన్నారు. ఈ రాష్ట్రంలో బెల్ట్ షాపులను, పర్మిట్ రూములను బంద్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక మంత్రి వివేక్ కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి కార్మికుల సమస్యలను పరిష్క రించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికులకు పెన్షన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర కార్మిక వెల్ఫేర్ బోర్డుకు కార్మిక నాయకున్ని చైర్మన్ గా నియమించాలని డిమాండ్ చే శారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నాయకులు కనకయ్య, లక్ష్మీనారాయణ, పర శురాములు,సత్తయ్య,వివిధ జిల్లాల కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.







# ఎమ్మెల్యే ఆరోగ్యం కోసం తిరుపతి లో పూజలు

**చేర్యాల, జూలై 28 (సిద్దిపేట పవర్)**

జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకొని ప్రజా సేవలోకి రావాలని కోరుతూ బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి డా.గదరాజు చందు ఈరోజు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శిం చుకొని మొక్కులు చెల్లించడం జరిగింది. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ "ప్రజల మదిలో నిలిచిన పల్లా కోలుకొని ప్రజా సంక్షేమ కోసం ప్రజాక్షేత్రంలోకి త్వరగా రావాలని ఆ వెంక టేశ్వర స్వామివారిని దర్శించుకోవడం జరిగింది అని ఆ స్వామి ఆశీస్సులతో పల్లా ప్రజాక్షేత్రంలోకి రావాలని తెలిపారు..ఆయనతో పాటు జితేందర్ తదితరులు పాల్గొన్నారు



## నేతన్నల ఖిల్లాకు జాతీయస్థాయి విద్యాసంస్థ ఏర్పాటు

- నేడే ప్రారంభం కానున్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం
- ఆన్ లైన్ ద్వారా కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించనున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- అప్పటి ఎంపీ, ప్రస్తుత బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ విశేష కృషితో ఏర్పాటు
- స్థలం, నిధులు మంజూరు, ఉపాధ్యాయులు సిబ్బంది కేటాయింపు



**సిద్దిపేట పవర్ రాజన్న సిరిసిల్ల, జూలై 28** సిరిసిల్ల ప్రాంత విద్యార్థులు జాతీయస్థాయి విద్యా ప్రమాణాలు పొందేలా అన్ని పోటీ పరీక్షలో రాణించే విద్యాసంస్థ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటయి పుష్కరకాలంగా విజయవంతంగా కొనసాగుతుంది. సిరిసిల్ల ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయి విద్యాసంస్థలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సిరిసిల్లలో అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో 2013 సంవత్సరంలో కేంద్రీయ విద్యాలయం కొరకు కృషి చేయగా 2015లో కేవీ మంజూరు అయింది. సిరిసిల్లలోని నేత కార్మికులు ఇతర పరిస్థితుల నేపథ్యంలో పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ, విశేష కృషితో కేవీ వచ్చేలా చేశారు దీంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం సిరిసిల్లలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. అలాగే ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతిలో 50 సీట్లను కేటాయించింది. దీనికి సంబంధించిన ఉపాధ్యాయులు, సిబ్బంది అవసరమైన ఫర్నిచర్ ను అందించింది. అప్పటి నుంచి కేంద్రీయ విద్యాలయం విజయవంతంగా కొనసాగుతుంది కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి తంగళ్ళపల్లి లో స్థలం కేటాయించింది.

**అప్పుడు మంజూరు ఇప్పుడు పూర్తి.....**

సిరిసిల్లకు కేటాయించిన కేంద్రీయ విద్యాలయం ప్రస్తుతం తంగళ్ళపల్లి పరిధిలో సొంత భవనం నిర్మాణం పూర్తి చేసుకొని 2025 ఏప్రిల్ నుండి అందుబాటులోకి వచ్చింది. అప్పటి కరీంనగర్ ఎంపీ ప్రత్యేక చొరవ విశేష కృషితోనే సిరిసిల్లకు కె.వి మంజూర అయిందని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తు చేసుకున్నారు. దాదాపు ఒక బ్యాచ్ విద్యార్థులు బయటికి రానున్నారు.

**ఆన్ లైన్ విధానం ద్వారా కేంద్ర విద్యా శాఖ మంత్రి చేతులమీదుగా ప్రారంభం...**

పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం సిరిసిల్లను ఆన్ లైన్ విధానం ద్వారా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జూలై 29న ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రివర్యులు డాక్టర్ సుకంతా మజుందర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, కేంద్ర విద్యాశాఖ సహాయం మంత్రివర్యులు (స్వతంత్ర ఇంచార్జి ) జయంత్ చౌదరి లు హాజరుకానున్నారు.




## ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా వికలాంగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

- వికలాంగుల చేయూత పింఛన్లు పెంచాలి
- ఆగస్టు 3న గజ్వేల్ సన్నాక సదస్సు ను జయప్రదం చేయండి
- వి పి హెచ్ యస్ అధ్యక్షులు కమల్ల భ్యుమయ్య పిలుపు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** దివ్యాగుల మరియు ఆసరా పెన్షన్ దారుల హక్కులకై ఆగస్టు 3న గజ్వేల్ లో జరిగే సన్నాక సదస్సు ను జయప్రదం చేయాలనీ వి హెచ్ పి ఎస్ గౌరవ అధ్యక్షులు కామల్ల భూమయ్య జగదేవపూర్ మండల కేంద్రం లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పోసాన్ పల్లి రాజు ఆధ్వర్యంలో జరిగిన మిట్టింగ్ లో పిలుపు నిచ్చారు. దివ్యంగులు వృద్ధులు వితంతువులు.దివ్యాంగుల చేయూత ఫించన్ దారుల సన్నాక సదస్సు కు ముఖ్యఅతిథిగా దివ్యాంగుల ఆత్మబంధువుడు విహెచ్పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రావడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడుస్తున్నా గాని దివ్యాంగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం 4016 పెన్షన్ ను 6016 వరకు, వృద్ధులకు, వితంతువులకు, బీడీ కార్మికులకు 2016 నుండి 4016 వరకు పెన్షన్ పెంచుతామని చెప్పి ఇంతవరకు పెంచకపోవడం చాలా బాధాకరం అని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు 5% రిజర్వేషన్ ఇవ్వాలి ఎన్నో దివ్యాంగుల కుటుంబాలు ఆసరా పెన్షన్ పైన బతుకుతున్నారని తెలిపారు. నేడు సకాలంలో పెన్షన్ పడక ఎంతో ఇబ్బంది పడుతూ వచ్చిన పెన్షన్ కూడా వారి హాస్పిటల్ ఖర్చులకు కూడా సరిపోవటం లేదని చెప్పారు. కొంతమంది దివ్యాంగులు ఒక పూట తింటూ మరో పూట పస్తులు ఉంటూ కాలం గడుపుతున్నారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి దివ్యాంగుల బాధలు కనిపించడం లేదా ? దివ్యాంగులు అంటే ఇంత చిన్న చూపా ? దివ్యాంగులు అంటే వివక్షత ఎందుకో తెలియడం లేదని అన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడం లేదు. దివ్యాంగులు మహిళల కంటే అధ్మానమా లేక దివ్యాంగుల్లాగా కనపడడం లేదా అని మండిపడ్డారు. దివ్యాంగులకు అంత్యోదయ కార్డ్స్ మంజూరు చేయడం లేదు. దివ్యాంగులకు కూడా రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఇలా చెప్పుకుంటూ పోతే వారి బాధలు ఎన్నో ఉన్నాయి. ఆగస్టు 13న చేపట్టబోయే ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి జగదేవపూర్ మండలం నుండి దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, బీడీ కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. అనంతరం వి హెచ్ పి ఎస్ మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా కామల్ల భూమయ్య, మండల అధ్యక్షులుగా భూమ దేవదానం ప్రధాన కార్యదర్శిగా గుండ్రు ఉప్పలయ్య ఉపాధ్యక్షులుగా నరసన్న కర్రయ్య చెక్కల ఉప్పలయ్య గౌట బాలకిషన్ కోశాధికారిగా దండు రవీందర్ సహాయ కార్యదర్శిగా కిష్టాపురం ఆంజనేయులు సబ్బని శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులుగా లక్ష్మి చిత్తా గౌడ్ భాస్కర్ సత్తయ్య జ్యోతి తదితరులు పాల్గొన్నారు .

## యువత సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై లోక్‌సభ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**తెలంగాణలో యువత సాధికారతపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి**



**సిద్దిపేట పవర్ వరంగల్ జూలై 28** తెలంగాణ రాష్ట్రంలో యువత సాధికారతకు కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలపై లోక్‌సభలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, వ్యవస్థాపకత లక్ష్యంగా తీసుకొచ్చిన పథకాల వివరాలను తెలియ జేయలని కేంద్ర మంత్రిని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక & ఉపాధి మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఈ మేరకు సమాధానం ఇచ్చారు. రాష్ట్రీయ యువ సశక్తికరణ్ కార్యక్రమ్ (RYSK), నేషనల్ సర్వీస్ స్కీమ్ (NSS) మరియు MY భారత్ వంటి కార్యక్రమాలు తెలంగాణలో అమలవుతున్నాయని వివరించారు. మై భారత్ 202526 వార్షిక ప్రణాళికలో భాగంగా వరంగల్ సహా రాష్ట్రంలోని జిల్లాల్లో "ఏక్ పెడ్ మా కే నామ్", "స్కిల్స్ ఫర్ సక్సెస్", "జిల్లా స్థాయి క్రీడా పోటీలు", "విక్షిత్ భారత్ - యువ ఉత్సవ్" లాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇక తాజాగా ప్రకటించిన ₹2 లక్షల కోట్ల ప్రధానమంత్రి ప్యాకేజీ ద్వారా ఐదేళ్లలో 4.1 కోట్ల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ..* ఖేలో ఇండియా", "ఫిట్ ఇండియా", "పిఎమ్ఈజీపీ", "స్కిల్ ఇండియా మిషన్" వంటి జాతీయ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో మరింత వేగవంతం చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిభ కలిగిన యువత ఉన్నారని తెలిపారు. వారికి సరైన అవకాశాలు కల్పిస్తే, వారు జాతీయ అభివృద్ధికి దోహదపడతారని తెలియజేశారు. రాష్ట్ర యువతకు ప్రాముఖ్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

## ఎస్ జిపిఏటి కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అధ్యక్షులుగా చిల్ల నరసింహులు
- ప్రధాన కార్యదర్శి బి మధుసూదన్ రెడ్డి

**సిద్దిపేట పవర్, జులై 28:**

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్ జిపిఏటి ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షులుగా చిల్లనరసింహులు ప్రధాన కార్యదర్శి బి మధుసూదన్ రెడ్డిలు ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఏ రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం పరశురాములు , టి చంద్రయ్య , వి .మల్లేశం , వి రాజమౌళి , కార్యదర్శులుగా ఎస్ శ్రీనివాస్ , డి శ్రీనివాస్, ఏ రామకృష్ణ , సిహెచ్ బాల నర్సయ్య , ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎస్ నాగేందర్, ఎం కృష్ణమూర్తి ,3. పి సురేందర్ రెడ్డి , ఎన్ భగవాన్ రెడ్డి, స్టేట్ కౌన్సిలర్ గా, జి బన్సీ లాల్ , బి ఇంద్రసేనారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎం కొండయ్య , ఆర్ హనుమంత రెడ్డి , బి లక్ష్మయ్య , వి.రాములు , ఎండి ఇంతియాజుద్దీన్ ,బి తిరుపతి, కాశీనాథ్ , సలహా కమిటీ సభ్యులుగా డి మల్లారెడ్డి ఎస్ నారాయణ రెడ్డి , జి సత్తయ్య , జోగుబిక్షపతి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎస్ నారాయణరెడ్డి, జోగు బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా పలు తీర్మానములు ఆమోదించారు. ఒకటి జులై 20 23 నుండి పెండింగ్ లోనున్న నాలుగు విడతల కరువు బత్యం బకాయిలను వెంటనే విడుదల చేసి నాటినుండి చెల్లించాల్సిన బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. 398 స్థిర మాస వేతనంతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు వారు పని చేసిన కాలం మొత్తానికి నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలనీ, అన్ని ఉద్యోగ పెన్షనరల సంఘాలతో చర్చలు పూర్తి అయినందున పిఆర్సి కమిటీ నివేదికను తెప్పించుకొని 51% ఫిట్మెంట్తో ఒకటి జులై 20 23 నుండి రివైజ్డ్ పే స్కేల్స్ ని అమలు చేయాలన్నారు. నగదు రహిత ఆరోగ్య పథకమును, (EHS) అమలు చేయాలన్నారు. మార్చ్ 20 24 నుండి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వారికి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్ లు వెంటనే విడుదల చేయాలి. బిస్వాల్ కమిషన్ 20 సంవత్సరాల సర్వీస్కు పూర్తి పెన్షన్ మంజూరుకు ప్రతిపాదించినందున 1 జులై 20 18 నుండి అమలు చేయాలనీ కోరారు. సిపిఎస్ విధానమును రద్దుచేసి ఓ పి ఎస్ విధానమును పునరుద్ధరించాలి. ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రవేశపెట్టిన అన్ని రకాల హామీలను అమలుపరచాలని కోరారు.





## పత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి యూ. వసంత రావు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** జగదేవపూర్ మండలంలోని అలీ రాజుపేట గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట ను మండల వ్యవసాయ అధికారి వసంతరావు సందర్శించారు. మండలంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు నేపథ్యంలో ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంట శాఖీయ దశ నుండి గూడ దశలో ఉందని, అక్కడక్కడ పారవిల్ట్ (సడన్ విల్ట్) కనిపిస్తుందని, దీని వలన మొక్కల ఆకులు ఎండిపోయినట్లు కనిపిస్తాయని అన్నారు. దీని నివారణకు పొలంలో ఉన్న అధిక నీటిని మురుగు కాలువల ద్వారా బయటికి పంపించాలని, సాధ్యమైనంత వరకు వేర్లకు గాలి తగిలినట్లు చేయాలని తర్వాత లీటర్ నీటికి 5 గ్రాముల 191919 గాని లేదా 13045 మరియు 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా 1 గ్రాము కార్బండిజమ్ అనే మందును కలిపి మొక్కల వేర్లు తడిసేలా పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే పత్తిలో పిండి నల్లి ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు 1.5 గ్రా ఎసిఫేట్ 75 ఎస్. పి లేదా 2 మి. లీ ఫిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ప్రస్తుతం పత్తిలో (విత్తిన 40 రోజులకు) రెండవ దఫా నత్రజని ఎరువు ను 25 కిలోలు మరియు పొటాష్ 15 కిలోలు ఒక ఎకరానికి వేసుకోవడానికి అనుకూలం అని అన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియా 1/2 లీ. పిచికారి మందులలో కలిపి వాడవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రైతులు కిష్టయ్య, బ్రహ్మచారి ఇతర రైతులు తదితరులు ఉన్నారు.

## ఏసీరెడ్డి సేవలు చిరస్మరణీయం

**సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి**

**సిద్దిపేట పవర్ చేర్యాల జులై 28:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు,జనగామ మాజీ ఎమ్మెల్యే,సిపిఎం నేత కామ్రేడ్ ఏసీ రెడ్డి నర్సింహారెడ్డి సేవలు చిరస్మరణీయమని అయన స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి యువతకు పిలుపునిచ్చారు.ఏసీరెడ్డి నర్సింహారెడ్డి 34 వ వర్ధంతి సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ. తుది శ్వాస విడిచే వరకు ఎత్తిన ఎర్రజెండా విడవకుండా ప్రజా సేవకు అంకితమైన కమ్యూనిస్టు యోధులు అమరజీవి ఏసిరెడ్డి నరసింహారెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని, ఆదర్శానికి మారుపేరని పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా, నైజాం సైన్యాలను ఎదిరించి దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి మట్టుపెట్టాలని, శ్రమకు తగ్గ ఫలితం కావాలని ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొని తుపాకీ తూటాలకు బలై తీవ్ర గాయాల పాలైనప్పటికీ ఎర్రజెండా ఎత్తుకొని పేద ప్రజలను విముక్తి గావించిన గొప్ప పోరాట యోధుడు ఏసి రెడ్డి నరసింహారెడ్డి అని కొనియాడారు. పార్టీ కార్యాలయంలోనే నివాసం ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ నడుచుకుంటూ, రిక్షాల పైన ప్రయాణం చేస్తూ గ్రామ గ్రామాన ప్రజా పోరాటాలు నిర్వహించారని, జనగామ ప్రాంతంలో ప్రతి గ్రామానికి, కుటుంబానికి ఏసిరెడ్డి నరసింహారెడ్డి అంటే తెలియని వారు ఉండరని, ఆయన సేవలు పొందని వారు లేరని అన్నారు. ఏసీ రెడ్డి నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారని ప్రజలే తన ఆస్తిగా తాను చివరి శ్వాస విడిచే వరకు పోరాటం చేసిన గొప్ప నాయకుడని, ఆ నాయకుని స్ఫూర్తితో నేడు పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్యకర్తలు ఉద్యమించాలని, ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో ఆలేరు యాదగిరి బండ కింద అరుణ్ కుమార్ పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు ఇప్పకాయల శోభ పోలోజు శ్రీహరి బండ కింది బాల నారాయణరాళ్ల బండి భాస్కర్ గొర్రె శ్రీనివాస్ గాండ్ల రవీందర్ బొంగోని భాస్కర్ మీరు గోజు సత్యనారాయణ రామచంద్రం తోడంగల రామచంద్రం దొనకల కనక లక్ష్మి ఎర్రబోసు అశోకు ఎండి ఎజాస్ ఆముదాల రంజిత్ రెడ్డి మంచాల నారాయణ బోదాసు మల్లయ్య తేలు ఇస్తారు దాసరి బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేత

**సిద్దిపేట పవర్ చేర్యాల జులై 28:** చేర్యాల పట్టణానికి చెందిన కూరెళ్ళ తిరుపతి గౌడ్ ఆరోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం విధితమే స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని సోమవారం ఫోన్ లో పరామర్శించగా కుటుంబానికి అండగా ఉంటానని మృతుడి కుటుంబానికి మనోధైర్యం ఇచ్చారు. అనంతరం స్థానిక బిఆర్ఎస్ నాయకులతో మృతుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య,జిల్లా నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి ,పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోల్ చంటి,మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, యూత్ ఇన్చార్జి శివగారి అంజయ్య, పట్టణ కార్యదర్శి బురగోని తిరుపతి గౌడ్, వార్డు ఇన్చార్జులు మంచాల కొండయ్య, పచ్చిమడ్ల సిద్ధిరాములు గౌడ్, నర్రా ఐలయ్య,అవుశేర్ల వెంకటేష్,అవుశేర్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు



## ఎరువుల షాపుల్లో పోలీసుల తనిఖీ

**సిద్దిపేట అర్బన్:**

సిద్దిపేట పట్టణంలో ఉన్న సీడ్స్, ఫర్టిలైజర్ షాప్ లో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, అర్బన్ వ్యవసాయ అధికారి శ్రీనాధ్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులలో తనిఖీల నిర్వహించినిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్, తదితర రికార్డ్స్ తనిఖీ చేసి షాప్ లో ఉన్నా సీడ్స్, ఫర్టిలైజర్ పరిశీలించారు. యూరియా అక్రమంగా దాచిపెట్టిన లేదా బ్లాక్ మార్కెటింగ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయదారులకు అందవలసిన యూరియా సక్రమంగా అందజేయాలని తెలిపారు. రైతులను మోసం చేయాలని చూసే షాపు యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని, తెలిపారు. వ్యవసాయ అధికారులు సూచించిన దాని ప్రకారం రైతులు యూరియా వాడుకోవాలని సూచించారు. ఎవరైనా అక్రమంగా యూరియా దాచిపెట్టిన వ్యవసాయేతర పనులకు యూరియా వాడిన ఇలాంటి సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ సమాచారం అందించాలని సూచించారు. లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 కు సమాచారం అందించాలని సూచించారు.

